చిత్రాలు.. అప్రమత్తతకు సందేశాలు



సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్ ప్రహరీపై ఉన్న రంగు రంగుల చిత్రాలు



డ్రైవింగ్‌పై అవగాహన కల్పించేలా గీసిన చిత్రం

సూర్యాపేటటౌన్ : జిల్లా కేంద్రంలోని పట్టణ పోలీస్ స్టేషన్ ప్రహరీపై పోలీసులు ఆకర్షణీయమైన చిత్రాలను పేయింటింగ్ వేయించారు. అందులో దొంగతనం, ఈవ్ టీజింగ్, సైబర్ మోసం, రోడ్డు ప్రమాదాలు, షీ టీమ్ ఇలా తదితర అంశాలకు సంబంధించిన చిత్రాలు ఉన్నాయి. ఈ బొమ్మలు పట్టణ పోలీస్ స్టేషన్‌కు వచ్చే వారితోపాటు రోడ్డుపై వెళ్లే వారిని ఎంతగానో ఆకర్షించడంతోపాటు పలు విషయాల్లో పాటించాల్సిన జాగ్రత్తలను గుర్తుచేస్తున్నాయి. ఈ సందర్భంగా సీఐ వెంకటయ్య మాట్లాడుతూ.. పట్టణ పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులతోపాటు బయట నుంచి వెళ్లే ప్రజలు ఈ చిత్రాలు చూసి కొంతవరకైనా భద్రత అంశాలపై అవగాహన పొందుతారని ఆశిస్తున్నట్లు తెలిపారు. మున్సిపల్ వారి సహకారంతో చిత్రాలను వేయించినట్లు పేర్కొన్నారు.



షీ టీమ్స్‌పై అవగాహన కల్పిస్తూ..



చైన్ స్నాచర్లు చేస్తున్న దొంగతనాలపై..



సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలని..

ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక.. నేడు సన్మానం

పెన్‌పహాడ్ : మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసినట్లు ఎంఈఓ నకిరేకంటి రవి గురువారం ప్రకటనలో తెలిపారు. వివిధ పాఠశాలలకు చెందిన డి.కృష్ణప్రసాద్, కె.రాజేశ్వరి, భాస్కర్ రావు, లింగయ్య, మంజూర్, వీరారెడ్డి, సునీత, చంద్రకళ, బైరెడ్డి భద్రారెడ్డి, మహేశ్వరి, శ్రీనివాసరెడ్డి, యాదగిరి, శోభన్‌బాబు, త్రివేద, లక్ష్మీనారాయణ, నగేష్, వాణిలను ఎంపిక చేసినట్లు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల సన్మానం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల పరిధిలో గురువారం ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపికచేసినట్లు ఎంఈఓ బి.బాలునాయక్ తెలిపారు. ఎంపికైన వారిలో స్థానిక జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం ఎం.విజయలక్ష్మి, ఉపాధ్యాయులు కోటమర్తి వీరయ్య, ఎస్.నిర్మలకుమారి, జి.కాల్‌రాం, ఎస్.మల్లిక, ఎండీ. రెహనాబేగం, నోముల వెంకటేశ్వర్లు, వి.యాదగిరి, ఎస్.కరుణ, సురభి శేఖర్, ఎం.ప్రశాంతి, ఎస్.మాధవి, ఎస్.స్వప్నమేరీ, బి.సుకన్య, పి.మంగమ్మ ఉన్నట్లు తెలిపారు. వీరికి శుక్రవారం స్థానిక జెడ్పీహెచ్‌ఎస్‌లో సన్మానం జరుగుతుందని చెప్పారు.

కంప చెట్ల తొలగింపు

ఆత్మకూర్ (ఎస్) : గట్టికల్ నుంచి కర్రోని తండా వరకు రోడ్డుకు ఇరువైపుల దట్టంగా పెరిగిన కంపచెట్లను గురువారం తొలగించారు. కంపచెట్ల కారణంగా ఎదురెదురుగా వచ్చే వాహనాలు మూలమలుపుల వద్ద కనిపించడం లేదు. దీంతో ఇప్పటికే పలువురు ప్రమాదాల బారిన పడ్డారు. వాహనదారుల ఇబ్బందులను గమనించిన గట్టికల్ మాజీ సర్పంచ్ గుగులోత్ పాండు నాయక్, సామ ఇంద్రారెడ్డి, పలువురు ఉపాధ్యాయుల ఆర్థిక సహాయంతో కంపచెట్ల తొలగింపు పనులు చేపట్టారు.

సభను విజయవంతం చేయాలి

నూతనకల్ : మండల కేంద్రంలోని సాయిరాం ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం నిర్వహించే ఆల్‌రోడ్డు ట్రాన్స్‌పోర్టు డ్రైవర్స్, వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రథమ మహాసభలను విజయవంతం చేయాలని ఎస్‌డబ్ల్యూఎఫ్ రీజియన్ కార్యదర్శి బత్తుల సుధాకర్ కోరారు. గురువారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు పంతం వెంకన్న, సురేష్, అవిలయ్య తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో హిందీ భాషా దినోత్సవం



నాగారం : పసునూర్ మోడల్‌స్కూల్‌లో హిందీ దివస్‌లో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



పెన్‌పహాడ్: అనాజీపురంలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న జిల్లా రిసోర్స్ పర్సన్ ఆనంద్‌భాస్కర్

నాగారం : విద్యార్థులు మాతృభాషతోపాటు జాతీయ భాష అయిన హిందీపై పట్టుసాధించాలని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ బి.చంద్రబాబు అన్నారు. గురువారం మండల పరిధిలోని పసునూర్ మోడల్ స్కూల్‌లో జాతీయ హిందీ భాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు హిందీ భాషపై అవగాహన కల్పించారు. ఉపన్యాస, డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. అనంతరం హిందీ ప్రాముఖ్యతను తెలిపే చార్టులు, కవులు, కవితలు, నాటికలు, నృత్యాలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో హిందీ రిసోర్స్ పర్సన్స్ హసీనా, రెడ్డబోయిన నాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని అనాజీపురం గ్రామంలోని పీఎంశ్రీ ఆదర్శ పాఠశాలలో గురువారం హిందీ భాషా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా రిసోర్స్ పర్సన్ జి.ఆనంద్ భాస్కర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. హిందీ భాషలో ప్రసంగం, పాటలు, నృత్యాలు, వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం హమ్ హిందీ భాత్కర్త అనే పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ కోడి లింగయ్య, హిందీ విభాగం ఇన్‌చార్జ్ ఉపాధ్యాయురాలు జహీర్‌బాబా, లక్ష్మీ భవాని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు రేడియం స్టిక్కర్లు



ఫణిగిరిలో ఎడ్లబండికి రేడియం స్టిక్కర్లను అతికిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

నాగారం : రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకుడు జంగిలి ఉపేందర్‌రావు అన్నారు. రోడ్డు ప్రమాదాలను నివారించడానికి గురువారం మండల పరిధిలోని ఫణిగిరి గ్రామంలో ఎడ్లబండ్లకు, ద్విచక్ర వాహనాలకు ఉచితంగా రేడియం స్టిక్కర్లు అంటించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, రాత్రిపూట రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు వాహనాలకు రేడియం స్టిక్కర్లు వేసుకోవాలని కోరారు. రోడ్డు ప్రమాదాల వల్ల కుటుంబ పెద్ద మరణిస్తే ఆ కుటుంబం వీధిన పడుతుందన్నారు. వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తూ వాహనాలను నడపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు సంజీవరెడ్డి, నాగు సరస్వతివెంకన్న, సత్తిరెడ్డి, విశాఖ విద్యాసాగర్‌రెడ్డి, కృపాకర్‌రెడ్డి, పెరమళ్ల జాన్‌వెస్లీ, తీగుళ్ల కృష్ణమూర్తి, సోమయ్య, గట్టు రవి, కల్లేట్లపల్లి రాములు, సూరయ్య, వెంకన్న, వంగూరి లింగమల్లు, జంపాల జనార్దన్, వేముల యాదగిరి, ఆకుల శంకరయ్య, అంజయ్య, వల్లాల సత్తయ్య, గోడిశాల అనిల్, పులిగిల్ల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పనులు వదులుకొని.. పొద్దస్తమానం పడిగాపులు



తుంగతుర్తి మండల కేంద్రంలోని పీఏసీఎస్ వద్ద యూరియా కోసం బారులుదీరిన రైతులు

తుంగతుర్తి : రైతులు యూరియా కోసం పడరాని పాట్లు పడుతున్నారు. బుధవారం మండల కేంద్రంలోని పీఏసీఎస్ కేంద్రానికి 880 బస్తాల యూరియా వచ్చింది. అయితే యూరియా కోసం రైతులు రాత్రి 10 గంటల నుంచే పీఏసీఎస్ వద్ద క్యూ కట్టారు. రోజుల తరబడి తిరుగుతున్నా ఒక్క బస్తా కూడా యూరియా దొరకడం లేదని రైతులు వాపోతున్నారు. అందరూ ఇళ్లకు వెళ్లిపోయిన తర్వాత రాత్రిపూట టోకెన్లు ఇస్తున్నారని రైతులు అంటున్నారు. పీఏసీఎస్ సిబ్బంది, అధికారులు క్యూలైన్ ఏర్పాటు చేసి క్రమ పద్ధతిలో యూరియాను సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు.

65 ఏళ్ల తర్వాత కొత్త భవనానికి మోక్షం

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల కేంద్రంలో 1960లో గ్రామ పంచాయతీ కార్యాలయానికి భవనాన్ని నిర్మించారు. అప్పట్లో సర్పంచ్‌గా పనిచేసిన అనిరెడ్డి సత్యనారాయణరెడ్డి తన స్థలాన్ని గ్రామ పంచాయతీకి విరాళంగా ఇచ్చి ప్రభుత్వ నిధులు రూ.30 వేలతో భవనాన్ని నిర్మించారు. కాలక్రమేణా ఈ భవనం పూర్తిగా శిథిలమైంది. అయితే తప్పని పరిస్థితుల్లో ఇప్పటి వరకు అందులోనే గ్రామ పంచాయతీని నడిపించారు. ఇటీవల ఎమ్మెల్యే మందుల సామేల్ కొత్త భవన నిర్మాణానికి రూ.25 లక్షలు మంజూరు చేయించగా.. పాత భవనాన్ని తొలగించివేశారు. త్వరలో కొత్తభవన నిర్మాణ పనులు మొదలుకానున్నాయి. 65 ఏళ్ల తర్వాత గ్రామ పంచాయతీకి కొత్తభవన నిర్మాణం జరుగబోతుంది.



శిథిలమైన భవనం కూల్చిన ప్రదేశం

బతుకమ్మ పాటల పుస్తకం ఆవిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సేవాసమితి సభ్యులు

సూర్యాపేట : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే అతి పెద్ద పండుగ బతుకమ్మ అని శ్రీ వాసవీ సేవాసమితి సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు బచ్చు పురుషోత్తం తెలిపారు. నూతనంగా తయారు చేయించిన బతుకమ్మ పాటల పుస్తకాలను శ్రీవాసవీ సేవాసమితి జిల్లా గౌరవ అధ్యక్షుడు ఈగ దయాకర్ గుప్తా సభ్యులతో కలిసి గురువారం పట్టణంలోని మినీ ట్యాంక్ బండ్ వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. శ్రీవాసవీ సేవాసమితి ద్వారా మున్ముందు ఎన్నో సామాజిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిరంతరం నిర్వహించనున్నట్లు తెలిపారు. సామాజిక సేవలో పాల్గొనే ఆసక్తి గల ఉత్సాహవంతులు సభ్యులుగా చేరవచ్చు అని తెలిపారు. బతుకమ్మ పుస్తకాలు కావలసిన వారు శ్రీ వాసవీ సేవాసమితి సభ్యులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో శ్రీ వాసవీ సేవాసమితి సభ్యులు మిరియాల సుధాకర్, గజ్జల రవీందర్, రాచకొండ శ్రీనివాస్, కొండ అనిల్ కుమార్, మహంకాళి ప్రణీత్, సోమ ప్రవీణ్ కుమార్, వీరవెల్లి విజయ్, సోమ సుమన్, ఈగ విజయలక్ష్మి, దేవరశెట్టి ఉమారాణి, చల్లా భారతి, నీలా ఉమారాణి, వీరవెల్లి ఉమ, బజ్జూరు శ్రీనివాస్, పరమేష్ పాల్గొన్నారు.

సెప్టెంబర్ 17 ముమ్మాటికీ విద్రోహ దినమే..



మాట్లాడుతున్న రేపాక లింగయ్య

సూర్యాపేటటౌన్ : సెప్టెంబర్ 17 ముమ్మాటికీ విద్రోహ దినమేనని సూర్యాపేట సామాజిక అధ్యయన వేదిక కన్వీనర్ రేపాక లింగయ్య అన్నారు. సెప్టెంబర్ 17 విలీనమా? విమోచనమా? విద్రోహమా? అనే అంశంపై గురువారం సూర్యాపేట సామాజిక అధ్యయన వేదిక ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సెప్టెంబర్ 17కు ఏ సంబంధం లేని ఫాసిస్ట్ శక్తులు ఇవ్వాల విమోచనం అని రంకెలు వేయడం వెనుక ఉన్న కుట్రను ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో రమణచారి, కరీం, వెంకట్ యాదవ్, ఆవుల నాగరాజు, యోగానంద్, ఉమర్, చర్లపల్లి వెంకటయ్య, చామకూరి నర్సయ్య, బుద్ధా సత్యనారాయణ, బి.క్రాంతికుమార్, దామల్ల వెంకన్న, నాయకపు పరమేష్, మెంటబోయిన సైదులు, జానయ్య, కిరణ్, ఫజల్ తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్లు, సీలింగ్ ఫ్యాన్ల బహూకరణ



కంప్యూటర్లు అందజేస్తున్న ఐడీబీఐ ప్రతినిధులు

సూర్యాపేటటౌన్ : మండల పరిధిలోని పిల్లలమర్రి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఐడీబీఐ సూర్యాపేట మేనేజర్ నాగరాజు, మిర్యాలగూడ ఐడీబీఐ ఏజీఎం పూర్ణేష్‌లు గురువారం ఐదు డెస్క్‌టాప్ కంప్యూటర్లు, ఐదు సీలింగ్ ఫ్యాన్లు, కుర్చీలను అందజేశారు. ఈ సందర్భంగా విద్యాశాఖ కోఆర్డినేటర్లు శ్రవణ్‌కుమార్, రాంబాబు, సూర్యనారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దేవరశెట్టి జనార్దన్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలకు దాతలు ముందుకొచ్చి విద్యార్థులకు ఉపయోగపడే వస్తువులను పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ప్రధానోపాధ్యాయురాలు కస్తూరి శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం

పెన్‌పహాడ్ : పాఠశాల అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమని ఎంపీడీఓ జానయ్య, ఎంఈఓ నకిరేకంటి రవి అన్నారు. గురువారం మండల పరిధిలోని దోసపహాడ్ ప్రాథమికోన్నత పాఠశాలలో గ్రామానికి చెందిన కొండేటి లింగారెడ్డి–రామానుజమ్మ దంపతుల జ్ఞాపకార్థం కుమారుడు కొండేటి జానకిరెడ్డి రూ.80వేల వ్యయంతో కళావేదిక నిర్మించేందుకు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మండల నోడల్ ఆఫీసర్ వస్రాం, మామిడి వెంకటయ్య, వెంకటేశ్వర్లు, విజయకుమారి, వెంకన్న, విప్లవకుమార్, కళ్యాణి, దొంగరి సుధాకర్, మదన్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యకరమైన జీవన శైలిని అలవర్చుకోవాలి



నాగారంలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వైద్యాధికారులు

నాగారం : మహిళలు ఆరోగ్యకరమైన జీవన శైలిని అలవర్చుకోవాలని మండల వైద్యాధికారి యనగందుల నాగరాజు అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న స్వాస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ (ఆరోగ్య మహిళ శక్తివంతమైన కుటుంబం అభియాన్) కార్యక్రమాన్ని గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రారంభించి మాట్లాడారు. మహిళలకు వైద్య ఆరోగ్య సేవలు అందించడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. అనంతరం స్పెషలిస్ట్ డాక్టర్, మానసిక వైద్య నిపుణురాలు డాక్టర్ నూర్జీబా మానసిక రోగులను పరీక్షించారు. ఈ కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి మాలోతు బిచ్చునాయక్, హెల్త్ ఎడ్యుకేటర్ విమలమ్మ, పీహెచ్‌ఎన్ఓ అరుణ కుమారి, సూపర్‌వైజర్ రామచంద్ర, వినోద, సిబ్బంది సుజాత, యాదగిరి, ప్రవీణ్‌రెడ్డి, నాగరాజు, ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



ఇళ్ల పనులను ప్రారంభిస్తున్న నాయకులు

అర్వపల్లి : అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తున్నట్లు కాంగ్రెస్ జిల్లా నాయకుడు గుడిపల్లి మధుకర్‌రెడ్డి తెలిపారు. జాజిరెడ్డిగూడేనికి మంజూరైన ఇందిరమ్మ ఇళ్లకు గురువారం ముగ్గుపోసే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ టి.గోపి, హౌజింగ్ ఏఈ పూజ, కార్యదర్శి డి.నవీన్ రెడ్డి, కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు దాసరి సోమయ్య, ఏఎంసీ డైరెక్టర్ జలేందర్, యాగయ్య, మాదగాని విక్రం, సమ్మయ్య, నిమ్మల కుమార్, శ్రీకాంత్, పాపయ్య, నరేష్, సైదులు, విజయలక్ష్మి, యల్లమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ విద్యార్థుల క్షేత్ర సందర్శన



పసునూర్ మోడల్‌స్కూల్ నుంచి క్షేత్ర సందర్శనకు వెళ్తున్న విద్యార్థులు

నాగారం : మండల పరిధిలోని పసునూర్ మోడల్ స్కూల్‌లో 9, 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు వృత్తివిద్య కోర్సులో భాగంగా గురువారం నాగారం, తిరుమలగిరి మండలాల్లో పారిశ్రామిక క్షేత్ర సందర్శనకు వెళ్లారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ బి.చంద్రబాబు మాట్లాడారు. క్షేత్ర పరిశీలనతో పొందిన విజ్ఞానం విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు.

మహిళల భద్రతకు కృషి

తిరుమలగిరి : మహిళల భద్రతకు పోలీస్ శాఖ పని చేస్తోందని తిరుమలగిరి ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. మండల పరిధిలోని బండ్లపల్లిలో బుధవారం రాత్రి పోలీసు ప్రజా భరోసా కార్యక్రమం నిర్వహించారు. భద్రతా పరంగా ఎలాంటి సేవలు అవసరమైనా 100కు డయల్ చేయాలని లేదా పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

కేవైసీ అప్‌డేట్ తప్పనిసరి

మునగాల : బ్యాంకు ఖాతాదారులు కేవైసీ అప్‌డేట్ చేయించుకోవాలని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ నాగప్రసాద్ కోరారు. గురువారం నర్సింహాపురంలో జనసురక్ష కార్యక్రమంలో భాగంగా గ్రామప్రజలు, బ్యాంకు ఖాతాదారులకు ఆర్థిక అక్షరాస్యత కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఆకుపాముల ఎస్‌బీఐ మేనేజర్ మధుసూదన్, గ్రామపంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, ఆర్థిక అక్షరాస్యత కేంద్రం కౌన్సిలర్లు లక్ష్మీనారాయణ, ఉదయ్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

అర్వపల్లి : ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీసీసీబీ మాజీ చైర్మన్ బీరవోలు సోమిరెడ్డి కోరారు. అడివెంల గ్రామానికి చెందిన మాజీ వార్డు సభ్యులు మద్ది అంజయ్య, నిమ్మనగోటి బుచ్చిరాములు, బీఆర్‌ఎస్ నాయకులు ఆలకుంట్ల దుర్గయ్య, కృష్ణతోపాటు కొంతమంది గురువారం సోమిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో ఎడ్ల సైదులు, పిట్టల సైదులు, జాని, బోయపల్లి రవి, మచ్చ లింగయ్య, సైదులు, జంపాల శివ, డి.సైదులు, వి.ప్రశాంత్, నాయకులు పాల్గొన్నారు.



కాంగ్రెస్‌లో చేరుతున్న నాయకులు

ప్రమాదకరంగా గుంత



ప్రమాదకరంగా ఉన్న గుంత

ఆత్మకూర్ (ఎస్) : మండల కేంద్రంలోని గణేష్ బజారుకు వెళ్లే రహదారిలో మురుగు కాలువపై నిర్మించిన బ్రిడ్జి కూలిపోవడంతో గుంత ఏర్పడి ప్రమాదకరంగా మారింది. ఈ రహదారిపై నిత్యం ట్రాక్టర్లు, బైకులు వెళ్తుంటాయి. వాహనదారులు రాత్రి సమయంలో గుంతలో పడి పలువురు ప్రమాదాల బారిన పడుతున్నారు. మురుగు కాల్వపై నిర్మించిన బ్రిడ్జి నాణ్యత లోపంతో కూలిపోయి ప్రమాదకరంగా మారిందని, వెంటనే నూతనంగా నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

జాజిరెడ్డిగూడెం పాఠశాలలో క్రీడాపోటీలు



జాజిరెడ్డిగూడెం జిల్లా పరిషత్ పాఠశాలలో క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న ఎంఈఓ, తదితరులు

అర్వపల్లి : విద్యార్థులు చదువుతోపాటు క్రీడలలో రాణించాలని జాజిరెడ్డిగూడెం మండల విద్యాధికారి బి.బాలు నాయక్, మండల నోడల్ అధికారి కుంభం ప్రభాకర్ అన్నారు. ఎస్‌జీఎఫ్ క్రీడోత్సవాలలో భాగంగా జాజిరెడ్డిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం తుంగతుర్తి నియోజకవర్గస్థాయి వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు చినవెంకట్ రెడ్డి, పీడీ లొడంగి సైదులు, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు పి.మల్లేష్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి యాకన్న, పీడీలు, పీఈటీలు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై అవగాహన

కోదాడరూరల్ : విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన ఉండాలని ఎంపీడీఓ ఇసాక్‌హుస్సేన్ అన్నారు. గురువారం మండలంలోని తొగర్రాయిలో ప్రాథమిక, జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. తమ ఇంటిని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ముందుగా గ్రామంలో ర్యాలీ తీసి కూడలిలో మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ పాండురంగన్న, హౌసింగ్ ఏఈ జేఎస్‌ఎస్ మూర్తి, కార్యదర్శి అవినాష్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

భూభారతి దరఖాస్తులను పరిష్కరించాలి



తుంగతుర్తి తహసీల్దార్ కార్యాలయంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

తుంగతుర్తి : భూభారతి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని అదనపు కలెక్టర్ సీతారామయ్య అన్నారు. గురువారం నియోజకవర్గ కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. గ్రామాల వారీగా దరఖాస్తులను పరిశీలించి నూతనంగా వచ్చిన జీపీఓలతో పని పూర్తి చేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ దయానందం, ఆయా మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



చివ్వెంల : బాధిత కుటుంబానికి ఆర్థికసాయం చేస్తున్న పూర్వవిద్యార్థులు

చివ్వెంల : మండల పరిధిలోని వల్లభాపురం గ్రామానికి చెందిన నాశనబోయిన సురేష్ ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందాడు. మృతుడి కుటుంబానికి జి.తిర్మలగిరి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2006–07 సంవత్సరం పదవ తరగతి స్నేహితులు గురువారం రూ.60 వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో వినోద్, వీరస్వామి, బొల్లికొండ సతీష్, గుడిసె రామక్రిష్ణ, అశోక్, గోపి, నాగరాజు, సురేందర్, సుధాకర్, మహిపాల్ రెడ్డి, లింగారెడ్డి, వెంకటేష్, నాగార్జున్, సుధీర్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే సాధారణ ప్రసవాలు



అర్వపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రసూతి అయిన మహిళతో వైద్యసిబ్బంది

అర్వపల్లి : ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే సాధారణ ప్రసవాలు జరుగుతాయని మండల వైద్యాధికారి డాక్టర్ భూక్యా నగేష్‌నాయక్ అన్నారు. కొమ్మాల గ్రామానికి చెందిన గర్భిణి బడుగుల లావణ్యకు గురువారం అర్వపల్లి పీహెచ్‌సీలో సాధారణ ప్రసవం చేశారు. ఈమెకు వివిధ పథకాలు వర్తిస్తాయని చెప్పారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ లలిత, స్టాఫ్ నర్సులు సునీత, కళమ్మ, సిబ్బంది శైలజ, కవిత పాల్గొన్నారు.

క్షయవ్యాధి నిర్ధారణ శిబిరం



అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల కేంద్రంలో బుధవారం క్షయవ్యాధి నిర్ధారణ ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. క్షయ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ఈ సందర్భంగా 20 మందికి వైద్యపరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ నగేష్‌నాయక్, ఉదయ్, టీబీ నోడల్ పర్సన్ కుంభం వీరయ్య, సూపర్‌వైజర్ లలిత, డాక్టర్ ఉదయ్, ఎల్‌టీ చొక్కయ్య, హెల్త్ అసిస్టెంట్‌లు సైదమ్మ, శకుంతల ఆశా కార్యకర్తలు నాగమ్మ, సైదమ్మ, వసంత పాల్గొన్నారు.

కంపు కొడుతున్న కాలువలు

తిరుమలగిరి : మున్సిపాలిటీ గుండా వెళ్తున్న వలిగొండ – తొర్రూర్ హైవే పనులు నత్తనడకన సాగుతుండడం, డ్రెయినేజీలు పూర్తి చేయకపోవడంతో మురుగునీరు కాలువల గుండా సాఫీగా వెళ్లడంలేదు. దీంతో మురుగునీటిలో దోమలు వృద్ధి చెంది ఇళ్లలోకి వస్తున్నాయి. ఫలితంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంవత్సరం దాటిన మురుగు కాలువల పనులు పూర్తి కాకపోవడంతో స్థానికులు అసౌకర్యానికి గురవుతున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. అధికారులు స్పందించి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని కోరుతున్నారు.



పిచ్చిమొక్కలతో పూడిన డ్రెయినేజీ